

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

## నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

భువనగిరి సిటీ, డిసెంబర్ 27 : పచ్చలకట్ట సోమేశ్వర స్వామి ఆలయ కమిటీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు కప్పగంతుల నాగరాజుశర్మ, పుట్టపాక భీష్మశర్మ, నాయకులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న ఆర్డీఓ జగన్నాథరావు

## ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

**● ఆర్డీఓ జగన్నాథరావు**

చౌటుప్పల్, డిసెంబర్ 27 : ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ జగన్నాథరావు అన్నారు. బుధవారం చౌటుప్పల్‌లోని వలిగొండ రోడ్డు సమీపంలోని సర్వే నంబర్ 113, 114 ప్రభుత్వ భూమి అన్యాక్రాంతంపై పలువురు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఆయన భూమిని పరిశీలించి హద్దులను పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ మరో 10రోజుల్లో పూర్తిస్థాయిలో సర్వే నిర్వహిస్తామని తెలిపారు.



నిత్యావసర సరుకులను అందిస్తున్న ఎంపీటీసీ కవితాసాగర్

## వృద్ధ దంపతులకు చేయూత

**● నమస్తే తెలంగాణ ఎఫెక్ట్**

సంస్థాన్‌నారాయణపురం, డిసెంబర్ 27 : మండలంలోని వావిళ్లపల్లికి చెందిన ఆడపు శంకరయ్య–లక్ష్మమ్మ వృద్ధ దంపతుల గుడిసె మంగళవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. దాదాపు రూ.4లక్షల నష్టం వాటిల్లింది. గుడిమాల్కాపురం ఎంపీటీసీ శివరాత్రి కవితా సాగర్ నమస్తే తెలంగాణ దిన పత్రికలో ప్రచురితమైన వార్తను చదివి బుధవారం వృద్ధ దంపతులను పరామర్శించారు. రేకులతో కూడిన ఇంటి నిర్మాణం చేపడుతానని హామీ ఇచ్చారు. అదే విధంగా నూతన ఇంటికి అవసరమైన సామగ్రి, రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కర్తి పాపయ్య, ఉప సర్పంచ్ రాజు, ఎంపీటీసీ దోటి జంగయ్య, బీఆర్‌ఎస్ నాయకులు గడ్డం మురళీధర్‌రెడ్డి, జినుకుల యాదయ్య, రాజు, రాజశేఖర్, తంగెళ్ల సత్తయ్య, స్వామి పాల్గొన్నారు.

## యాదయ్య మృతికి ఎమ్మెల్యే వీరేశం నివాళి

రామన్నపేట, డిసెంబర్ 27 : మండలంలోని లక్ష్మాపురంలో టీడీపీ మండలాధ్యక్షుడు నీల యాదయ్య బుధవారం గుండెపోటుతో మృతి చెందగా.. ఎమ్మెల్యే వేముల వీరేశం ఆయన మృతదేహాన్ని సందర్శించి పూల మాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. నివాళులర్పించిన వారిలో గంగుల రాజిరెడ్డి, జినుకల ప్రభాకర్, పున్న జగన్‌మోహన్, బత్తుల కృష్ణగౌడ్, ఎంపీటీసీలు మాడూరి జ్యోతీప్రభాకర్‌రావు, ఎండీ రేహాన్, సర్పంచులు గుత్తా నర్సిరెడ్డి, చిల్లర కైలాసం, గోదాసు పృథ్వీరాజ్, రామిని రమేశ్, ఎండీ అక్రం, కూనూరు కృష్ణ, సాల్వేరు లింగం పాల్గొన్నారు.

# చురుగ్గా మోడ్రన్ ధోబీఘాట్ పనులు

**రూ.2కోట్లతో నిర్మాణం**

**అధునాతన యంత్రాలతో అందుబాటులోకి..**

భూదాన్‌పోచంపల్లి, డిసెంబర్ 27 : పట్టణంలోని సింగిల్ విండో కార్యాలయం సమీపంలో రూ.2 కోట్లతో నిర్మిస్తున్న మోడ్రన్ ధోబీఘాట్ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. రెండు నెలల క్రితం మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి నిధులు మంజూరు చేయించి పనులకు శంకుస్థాపన చేశారు. బేస్మెంట్ దశలో పనులు పూర్తయ్యాయి. ఇందులో రూ.45లక్షలతో అధునాన యంత్రాలను ఏర్పాటు చేయనున్నారు. మరో 3 నెలల్లో పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు చెబుతున్నారు. పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో సుమారు 200 కుటుంబాలు కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. మోడ్రన్ ధోబీఘాట్ పనులు పూర్తికాగానే పెద్ద షెడ్డు నిర్మించి యంత్రాలను అమరుస్తారు. బట్టలు ఉతికే యంత్రాలు, ఆరబెట్టేవి, ఇస్త్రీ చేసే యంత్రాలను ప్రభుత్వమే సమకూర్చనున్నది. గంటకు 200 దుస్తులు ఉతికి ఇస్త్రీ చేసే యంత్రాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. భవనం పూర్తి కాగానే రజక వృత్తిదారులకు ఆర్థికంగా ఎదిగేందుకు మార్గం సుగమంకానుంది.



భూదాన్‌పోచంపల్లిలో బేస్మెంట్ దశలో ఉన్న మోడ్రన్ ధోబీ ఘాట్

### మూడు పనులు పూర్తి



పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో మోడ్రన్ ధోబీఘాట్‌ను రూ.2కోట్లతో నిర్మిస్తున్నాం. ఇప్పటికే పనులు చాలా వరకు పూర్తయ్యాయి. మరో 3 నెలల్లో ధోబీఘాట్ అందుబాటులోకి రానుంది. పూర్తిస్థాయి మిషనరీ వస్తుంది. రజకులకు ఎంతగానో ఉపయోగపడతాయి.

– కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్

### సంతోషంగా ఉంది



ప్రభుత్వము ఆధునిక ధోబిఘాట్ నిర్మించడం చాలా సంతోషంగా ఉంది. మా రజక వృత్తిదారులకు అభివృద్ధికి నిధులు మంజూరు చేయించిన అప్పటి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు. ఆధునిక వసతులు సమకూరి మాకు ఆదాయం పెంచుకునే మార్గం ఏర్పడుతుంది.

– చేరాల చిన్ననర్సింహ, భూదాన్‌పోచంపల్లి

## ఆర్థిక సాయం

భూదాన్‌పోచంపల్లి, డిసెంబర్ 27 : మండలంలోని గౌస్‌కొండలో దోసపాటి మల్లయ్య(70) పొలం గట్టు పైనుంచి జారి పడి మృతి చెందాడు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సమకూర్చిన రూ.5వేలు, వాకిటి జంగారెడ్డి రూ.10వేలు ఆర్థిక సాయాన్ని బుధవారం మలయ్య కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గూడూరు గోపాల్ రెడ్డి, మునుకుంట్ల మల్లేష్, లింగాల నరసింహ, మర్రి పాండు రెడ్డి, రవి, రాజు, రెహన్య, గోపి, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

రామన్నపేట, డిసెంబర్ 27 : విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా నాయకుడు, సింగిల్ విండో డైరక్టర్ కన్నెకంటి వెంకటేశ్వరచారి అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశ్వకర్మల కోసం ప్రవేశపెట్టిన పథకం కోసం చేతివృత్తులు, కులవృత్తిదారులు సమీపంలోని సీఎస్‌సీలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం అర్హులను గుర్తించి రోజుకు రూ.500 ఉపకార వేతనంతో శిక్షణ ఇస్తుందని చెప్పారు.



విద్యుత్ స్తంభం పడి ధ్వంసమైన మిర్చీ బండి

## త్రుటిన తప్పిన ప్రమాదం

రామన్నపేట, డిసెంబర్ 27 : మండలకేంద్రంలోని చిట్యాల–భువనగిరి రోడ్డు విస్తరణలో భాగంగా సుభాశ్‌సెంటర్ సమీపంలో ఉన్న పాత విద్యుత్ స్థంభాన్ని క్రేన్ సహాయంతో తొలగిస్తుండగా అదుపుతప్పి మిర్చీ బండిపై పడింది. దీంతో బండి పూర్తిగా ధ్వసమయింది. ప్రమాద సమయంలో బండి నిర్వాహకులు ముత్యాల ఆమని, ముత్తయ్యతో పాటు కొద్దిమంది దూరంగా వెళ్లడంతో త్రుటిలో ప్రాణపాయం తప్పింది.

## వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 27 : పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం మహా పడి పూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మేలుకొలుపు, గణపతి హోమం, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మెరుగు గోపాల్‌యాదవ్, రాపోలు రామచంద్రం, గురు స్వాములు పాల్గొన్నారు.



మహా పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

## దివీస్ సహకారం అభినందనీయం

**● పంతంగి సర్పంచ్ సత్యం**

చౌటుప్పల్ రూరల్, డిసెంబర్ 27 : గ్రామాల అభివృద్ధికి దివీస్ సహకరాం అభినందనీయమని పంతంగి సర్పంచ్ బాతరాజు సత్యం అన్నారు. బుధవారం పంతంగి గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు దివీస్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ జయంత్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు రఘుప్రసాద్, బాలరాజు, దివీస్ పరిశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.



పాచిల్ల ప్రాథమిక పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీధర్

## పాఠశాల రికార్డుల పరిశీలన

గుండాల, డిసెంబర్ 27 : మండలంలోని పాచిల్ల ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ శ్రీధర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులతో పాటుగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల ప్రగతి, బేస్‌లైన్ టెస్టు, మాస వారిగా ప్రగతిని స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు వీరేశం, ఉపాధ్యాయులు ఉన్నారు.

## అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించాలి

మేళ్లచెర్వు, డిసెంబర్ 27 : అర్హులైన పేదలకు ఆరు గ్యారెంటీ పథకాలు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి వట్టెపు సైదులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో సైదులు, కొండలు పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలి

**● జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్**



సమావేశంలో మాట్లాడుతున్న మానిటరింగ్ అధికారి శ్రీనివాస్

రామన్నపేట, డిసెంబర్ 27 : విద్యార్థుల విద్యాప్రమాణాలను మెరుగు పర్చాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి జే.శ్రీనివాస్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలంలోని వెల్లంకి ఉన్నత పాఠశాలతో పాటు బోగారం యూపీఎస్, సర్నేనిగూడెం ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు.

# అయోధ్య రాముడి అక్షింతల ఊరేగింపు

గుండాల, డిసెంబర్ 27 : మండలంలోని సుద్దాల, బ్రాహ్మనపల్లి గ్రామాల్లో అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలను మంగళవారం రాత్రి ఊరేగించారు. కార్యక్రమంలో అర్చకులు వేప నర్సింహామూర్తి, సరాబోజు వెంకటేశ్వరచారి, సర్పంచులు గూడ ఉపేంద్రరవీందర్, బండారు సంధ్యాశ్రీనివాస్, ఆంజనేయ ఆలయ కమిటీ చైర్మన్ ఏలె లింగం, అమ్మ యాది ఫౌండేషన్ చైర్మన్ పెండెం సత్యానారాయణ, వేణుగోపాల్‌రెడ్డి, బండారు వెంకటేశ్, రమేశ్ పాల్గొన్నారు.



అక్షింతలను ఊరేగిస్తున్న గ్రామస్తులు